మహిళా సాధికారత సాధించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: విద్యార్థినులు అందరూ చదువుకొని ఉద్యోగాలు సాధించి, మహిళా సాధికారత సాధించాలని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ త్రిపురనేని వెంకటరత్నం అన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని ఆకాంక్షించారు. అన్ని రకాల చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఆంధ్ర మహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ వుమెన్‌లో లీగల్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను మంగళవారం నిర్వహించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్, దుర్గాసేవా స్రవంతి, లీగల్ అండ్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెల్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వెంకటరత్నం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. నిత్య జీవితంలో మహిళలు ఎదుర్కొనే సమస్యలన్నింటికీ చట్టపరంగా పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ పి. రజని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. ఝాన్సీ రాణి, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కరుణాదేవి, డీడీఎంఎస్ లీగల్ ఎయిడ్ సెంటర్ ఫర్ వుమెన్ చైర్‌పర్సన్ విజేత, లీగల్ అండ్ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెల్ కన్వీనర్ డాక్టర్ వై. వసుంధర, న్యాయవాదులు కృష్ణవేణి, సరళారెడ్డి, గీతకుమారి, కరుణ, జ్యోతి, రాజా, సుభద్రమ్మ హాజరయ్యారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ త్రిపురనేని వెంకటరత్నం

ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ (జనరల్) గా డాక్టర్ రామ్ షెఫర్డ్ భీనవేణి నియమితులయ్యారు. ఈ మేరకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. సోషియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రామ్ ప్రస్తుతం ఆ విభాగం బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వైస్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన డాక్టర్ అనుపమ విధుల నుంచి తప్పించాలని కోరడంతో ఈ నియామకాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులు అభినందించారు.

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి

బొల్లారం,ఏప్రిల్ 2:కంటోన్మెంట్ ఏడో వార్డు పరిధిలోని సూర్య ఎన్‌క్లేవ్,మలనీ కాలనీలో కొన్ని రోజుల నుంచి మంచి నీటి సరఫరా లైన్ నుంచి కలుషిత నీరు రావడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కంటోన్మెంట్ బోర్డు సంబంధిత అధికారులు సమస్యను పట్టించుకొని పరిష్కరించాలని కోరుతున్నారు.

మేరు కులస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలి

అబిడ్స్, ఏప్రిల్ 2 : నామినేటెడ్ పదవుల నియామకాలలో మేరు కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని టీపీసీసీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవించారు. కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పొల్కం వినయ్‌రాజ్, దశరథ్, శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో..అన్నదానం

వెస్ట్ మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఓం నమ:శివాయ గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నివేదిత మాట్లాడుతూ...ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా ఓం నమ:శివాయ గ్రూప్ ప్రతినిధులందరూ ఐక్యతగా ఉంటూ ప్రతి మంగళవారం ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా ఆలయ పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేష్ బీఆర్ఎస్ నాయకు రాలు నివేదితను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు నాగేందర్ యాదవ్, వేణుగోపాలచారి, ఆలయ ప్రధాన అర్చకులు రాజేశ్వరశర్మ, ఓం నమ:శివాయ గ్రూప్ సభ్యులు శ్రీకాంత్, రాంబాబు, సురేష్ ,కృష్ణ, ఆనంద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. – మారేడ్‌పల్లి, ఏప్రిల్ 2

పాపన్న చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 2: గోల్కొండ కోటపై బహుజన జెండా ఎగురవేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని ఉస్మానియా యూనివర్సిటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఓయూ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ చలమల్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాపన్న ఆశయాలను కొనసాగించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించడమన్నారు. ఆయన జనరంజకంగా పాలించాడని గుర్తు చేశారు. సాధారణ కల్లు గీత కార్మిక కుటుంబంలో పుట్టి, రాజ్యాన్ని స్థాపించడం గొప్ప విషయమన్నారు. ఆయన రాజ్యంలో అసలు పన్నులు ఉండేవి కావని, సామాజిక న్యాయం పాటిస్తూ ఎంతో గొప్పగా పాలించాడని కొనియాడారు. దాదాపు 300 సంవత్సరాల క్రితమే బహుజనులకు రాజ్యాధికారం సాధించిపెట్టిన గొప్ప యోధుడని కీర్తించారు. పాపన్న చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చడంతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. జనగామ జిల్లాను సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ చంద్రు, డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ నాగేశ్వరరావు, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

డబుల్ ఇండ్లల్లో అధికారుల తనిఖీలు

బోయిగూడ ఐడీహెచ్ కాలనీలోని డబుల్ ఇండ్లల్లో తనిఖీలు చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రంజని, అధికారులు

బన్సీలాల్‌పేట్, ఏప్రిల్ 2 : న్యూబోయిగూడలోని ఐడీహెచ్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంగళవారం సికింద్రాబాద్ మండల రెవెన్యూ అధికారులు సందర్శించారు. ప్రభుత్వం కేటాయించిన వారు కాకుండా ఇతరులు ఇండ్లలో నివసిస్తున్నారని కొందరు స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.
డిప్యూటీ తహసీల్దార్ ఎ.రంజనీ యాదవ్, ప్రత్యేక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌లు పలు ఇండ్లను తనిఖీ చేశారు. స్థానికులతో మాట్లాడారు. గతంలో ఎవరికీ కేటాయించని, ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు ప్రభుత్వం తాళాలు వేసిందని, ఆ ఇండ్లలోకి ఎవరైనా అక్రమంగా వెళ్తే చట్టప్రకారం కేసు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఆమె అన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు చిరంజీవి, ఎంఎం.రాజు, ఖాజామోయిన్, కృష్ణ ముదిరాజ్‌లు కూడా వారి వెంట ఉన్నారు.

కూటమి అభ్యర్థిగా టీడీపీకి అవకాశం కల్పించాలి

కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీ పార్టీకి అవకాశం కల్పించాలని కోరుతున్న టీడీపీ నాయకులు

బొల్లారం,ఏప్రిల్ 2:కంటోన్మెంట్ నియోజకవర్గం ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీ పార్టీకి అవకాశం కల్పించాలని టీడీపీ సీనియర్ నాయకులు మధుసూదన్ రావు తెలిపారు.మంగళవారం తిరుమలగిరి నల్లపోచమ్మ ప్రాంగణంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ..రానున్న కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా టీడీపీ పార్టీకి అవకాశం కల్పిస్తే కూటమి జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు జే.నర్సింగ రావు,ఎం.మధుసూదన్,డీఆర్.శ్రీనివాస్, కే.ప్రతాప్,అనురాధ,బి.వెంకట్ రావు,చంద్రశేఖర్,వై.సుదర్శన్,నర్సింగ్‌గౌడ్,అశోక్ యాదవ్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆయకట్టును పరిశీలించిన అధికారులు

శామీర్‌పేట, ఏప్రిల్ 2 : నీటి పారుదల శాఖ అధికారులు మంగళవారం శామీర్‌పేట మండలంలో పర్యటించారు. చెరువు కింద పండే ఆయకట్టును పరిశీలించారు. మండలంలోని శామీర్‌పేట, ఆలియాబాద్, జగన్‌గూడ గ్రామాలతో పాటు పక్కనే ఉన్న యాదాద్రి –భువనగిరి జిల్లా బొమ్మల రామా రం మండలంలో ఆయకట్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ ప్రశాంత్, వర్క్‌ఇన్‌స్పెక్టర్ వాసుదేవ పాల్గొన్నారు.

చేతికందేలా.. కరెంట్ తీగలు

భయం గుప్పిట్లో కాలనీవాసులు

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్నది. విద్యుత్ తీగలు నేలను తాకుతూ వెళ్తున్నా.. వారు పట్టించుకోవడంలేదు. న్యూ బోయిన్‌పల్లిలోని కడక్‌పురాలో మజీద్ ఒమర్ సమీపంలో చేతికి అందేలా కరెంట్ తీగలు వేళాడుతూ ఉన్నా కనీసం అధికారులు పట్టించుకోవడం లేదు. పలుమార్లు బోయిన్‌పల్లి విద్యుత్ అధికారికి ఫిర్యాదులు చేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. కరెంట్ తీగలు చేతులకు అందేలా ఉన్న క్రమంలో విద్యుత్ శాఖకు సంబంధించి ఇబ్బందులు ఉన్నా తాను సొంతంగా కరెంట్ స్తంభాన్ని అందిస్తానని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి ముందుకొచ్చినా అధికారుల్లో మాత్రం చలనం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. – కంటోన్మెంట్, ఏప్రిల్ 2

సాఫ్ట్‌బాల్ బాలికల జట్టుకు సన్మానం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఔరంగాబాద్ వేదికగా నిర్వహించిన జాతీయ సబ్‌జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్ షిప్‌లో స్వర్ణ పతకం సాధించిన రాష్ట్ర బాలికల జట్టును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ జితేందర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్, వేణుగోపాలచారి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కాచిగూడ, ఏప్రిల్ 2 : పార్లమెంట్ ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్న వ్యక్తిపై కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాకలోని భాగ్యనగర్‌కు చెందిన ఆనంద్‌కుమార్ ఇంట్లో మద్యం బాటిళ్లు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని అతడి నుంచి 16 క్వార్టర్ బాటిళ్లను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

ముదిరాజ్‌లు సంఘటితం కావాలి

అందె బాబయ్యకు నియామకపత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ చొప్పరి శంకర్

హిమాయత్‌నగర్, ఏప్రిల్ 2: ముదిరాజ్ కులస్తులు సంఘటితమై హక్కులు, రాజ్యాధికార సాధన కోసం ముందడుగు వేయాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. మంగళవారం నారాయణగూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అందె బాబయ్య ముదిరాజ్‌ను నియమిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. చొప్పరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి ముదిరాజ్ కులస్తులు మరింత చైతన్యవంతులై హక్కులను కాపాడు కోవాలని పిలుపునిచ్చారు.లోక్‌సభ ఎన్ని కల్లో పోటీచేసే ముదిరాజ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

వరల్డ్ పవర్‌లిఫ్టింగ్‌లో శిల్పకు రజతం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: నొయిడా వేదికగా నిర్వహించిన వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ జాతీయ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ లిఫ్టర్ శిల్ప దిగ్గాయి రజత పతకంతో మెరిసింది. మంగళవారం నిర్వహించిన మహిళల 90కిలోల విభాగంలో శిల్ప..స్క్వాట్‌లో 85కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 40కి, డెడ్‌లిఫ్ట్‌లో 102.5 కిలోలు..మొత్తంగా 227.5 కిలోలతో రెండో స్థానంలో నిలిచింది. రుచి(ఢిల్లీ) మొత్తం 300కిలోలతో టాప్‌లో నిలిచి పసిడి పతకం కైవసం చేసుకుంది. మరోవైపు మహిళల ఓపెన్ కేటగిరీలో రియా గుప్తా(హర్యానా), నిధిక షెరావత్(ఢిల్లీ) వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు.

ప్రచార వ్యూహాలపై పదును

- నేడు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ సమన్వయ సమావేశం
- ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్, ఏప్రిల్ 2: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానంలో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏప్రిల్ 3 నుంచి సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నామని హైదరాబాద్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి టి.పద్మా రావు, మాజీ మంత్రి తలసాని, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్‌తో పాటు ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కె.విప్లవ్‌కుమార్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేశ్, మన్నె కవితారెడ్డిలతో జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలకు సన్నాహాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ.. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ముఖ్యనాయకులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేద్దామని సూచించారు. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం సమన్వయ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.
కార్పొరేటర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలతో చర్చించి ప్రచార వ్యూహాలను ఖరారు చేయనున్నామని పేర్కొన్నారు. బూత్‌స్థాయిలో కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయాలని సూచించారు.

మహిళలు మరింత అభివృద్ధి చెందాలి

చిత్రపురి మహిళా శక్తి గ్రూప్ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

మణికొండ, ఏప్రిల్ 2: మహిళలు ఉచిత శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొని మెలకువలు నేర్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క అన్నారు. చిత్రపురి మహిళా శక్తి గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో చేపడుతున్న శిక్షణా శిబిరం లోగో మంగళవారం ప్రగతి భవన్‌లో మంత్రి సీతక్క ఆవిష్కరించారు. ఉగాది నుంచి ఎల్ఐజీ/ఈడబ్ల్యూఎస్ ఉచిత కుట్టు మిషన్ ట్రైనింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని మంత్రిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు కష్టపడి పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందించేందుకు తాను తప్పకుండా చిత్రపురికి వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కస్తూరి విజయ, సునైనా, సరోజిని, పద్మ, స్వప్న, లక్ష్మి, రాజేశ్వరి, చిత్రపురి ఎల్ఐజీ/ఈడబ్ల్యూఎస్ ఓనర్స్ కమిటీ కస్తూరి శ్రీనివాస్, ధనరాజ్, తోట తిరుపతి పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు

మేడ్చల్, ఏప్రిల్ 2 : ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. మేడ్చ ల్ మున్సిపాలిటీ పరిధిలో లైసెన్స్ లేకుండా వ్యా పారం నిర్వహిస్తున్న సంస్థల ను మంగళవారం కమిషనర్ సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురపాలక సంఘ చట్టం 2019 ప్రకారం విధిగా ట్రేడ్ లైసెన్స్ ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ఏడు రోజుల్లో లైసెన్స్‌లు లేని ప్రతి ఒక్కరూ పొందాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్ ద్వారా నేరుగా కూడా లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకొని, పొందవచ్చన్నా రు. అయితే తప్పుడు కొలతలు నమోదు చేసినట్టు గుర్తిస్తే 25 రెట్ల జరిమానా ఉంటుందని ఆయన చెప్పారు. కమిషనర్‌వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో కీసర మండల బీఆర్ఎస్ నేతలు

సమావేశానికి తరలివెళ్లిన బీఆర్ఎస్ నేతలు

కీసర, ఏప్రిల్ 2 : మేడ్చల్ నియోజకవర్గ సమావేశానికి కీసర మండలం నుంచి భారీ సంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు తరలివెళ్లారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గస్థాయి సమావేశాన్ని మేడ్చల్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పిలుపుమేరకు భారీ ఎత్తున కీసర మండలం నుంచి బీఆర్ఎస్ నేతలు తరలివెళ్లారు. జై కేసీఆర్, జై తెలంగాణ అంటూ భారీ నినాదాలతో తరలివెళ్లారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అంటున్నారు.

జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలు ప్రదానం

ముషీరాబాద్, ఏప్రిల్ 2 : జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో వివిధ రంగాల ప్రముఖులకు జీవీఆర్ ఆత్మీయ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కె.వి. రమణాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి.. వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న రామరాజు లక్ష్మి, వి.వి.రాఘవరెడ్డి, శ్రీమల్లిక్, తిరుమలేశ్వరావు, సినీ నటి రాగిణి, నృత్య గురువులు కె.నిర్మల, అపర్ణలకు పురస్కారాలు అందజేశారు. లయన్ చిల్లా రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సి.రామకృష్ణ, లంక లక్ష్మీనారాయణ, రామరాజు శ్రీనివాసరావు, కొండపాక కృష్ణమాచార్య, గిడుగు కాంతి కృష్ణ, కె.విజయలక్ష్మి, వి.శైలజ, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, ఎస్.రామసుబ్రహ్మణ్యం నృత్యకళాకారులు ఐశ్వర్య, శిరీష తదితరులు పాల్గొన్నారు.

5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించాలి

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 2 : 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు 5 శాతం రాయితీతో ఈ నెల 30లోపు చెల్లింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇంటి పన్నును బిల్లు కలెక్టర్లకు లేదా ఆన్‌లైన్ EMUNICIPAL.TELANGANA.GOV.IN లేదా కార్యాలయంలో చెల్లించాలని సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఘట్‌కేసర్,ఏప్రిల్2: పన్నుల చెల్లింపులో ప్రభుత్వం కల్పించిన రాయితీని ప్రజలు ఉపయోగించుకొని.. ఈనెల చివరి వరకు పూర్తి స్థాయి పన్నులు చెల్లించాలని ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కమిషనర్ ఎండి సాబేర్ అలీ ప్రజలను కోరారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి వసూలైన పన్నుల వివరాలను ఆయన వివరించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో రూ.5కోట్ల,98లక్షల,95వేలు రావల్సి ఉండగా, మార్చి 31 వరకు రూ.3కోట్ల,70లక్షల,40వేలు వసూలు అయినట్లు వివరించారు. మిగతా రూ.2కోట్ల,28లక్షల,55 వేలను వసూలు చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పన్నుల చెల్లింపునకు ప్రభుత్వం కల్పించిన 5శాతం రాయితీని ప్రజలు ఉపయోగించుకొని ఏప్రిల్ చివరి వరకు చెల్లించాలని ఆయన కోరారు.

ఆస్తిపన్ను వసూలు 116 శాతం

అంబర్‌పేట, ఏప్రిల్ 2 : ఈ ఏడాది ఆస్తిపన్ను వసూలులో అంబర్‌పేట సర్కిల్ రికార్డు బ్రేక్ చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం(మార్చి 31) ముగిసే సమయానికి 116 శాతం పన్నును వసూలు చేసింది. రూ.53.65 కోట్ల పన్ను వసూలు టార్గెట్‌గా ఉండగా, రూ.62.11 కోట్ల పన్ను వసూలైంది. డీసీ మారుతి దివాకర్ నేతృత్వంలో ఏఎంసీలు, బీసీలు, టీఐలు కలిసికట్టుగా టార్గెట్‌ను మించి పన్ను వసూలు చేశారు.
ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్ డీసీ, ఇతర రెవెన్యూ సిబ్బందిని అభినందించారు.